క్లుప్తంగా

వైభవంగా వారపు ఉత్సవం


ఊరేగుతున్న సిరులతల్లి

చంద్రగిరి : తిరుచానూరు పద్మావతీదేవి శుక్రవారం బంగారు తిరుచ్చిపై విహరించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని శ్రీకృష్ణ ముఖ మండపం వద్ద కనులపండువగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం అలంకార మండపంలో వేడుకగా ఊంజల్ సేవ చేపట్టారు. సాయంత్రం. సర్వాలంకార భూషితులైన శ్రీవారి దేవేరి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై మాడవీధులలో ఊరేగారు. ఆలయ సూపరింటెండెంట్ రమేష్, ఏవీఎస్‌ఓ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌గా చెత్త సేకరణ


చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామచంద్ర

తిరుపతి రూరల్ : మండలంలోని చిరువాడ పంచాయతీలో స్పెషల్ డ్రైవ్ కింద ఇంటింటి చెత్త సేకరణ చేపట్టారు. వారం నుంచి అధికారుల పర్యవేక్షణలో చెత్త సేకరిస్తున్నారు. శుక్రవారం ఈ మేరకు ఎంపీడీఓ రామచంద్ర గ్రామానికి చేరుకుని పనులు పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరించే విధానం, స్థానిక మహిళలు చెత్తను తీసుకువచ్చి అప్పగించే పద్ధతి, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే పనులను గమనించారు. పకడ్బందీగా చెత్త సేకరణకు కృషి చేసిన పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవిని అభినందించారు

కంపెనీలో మోసంపై కేసు

తిరుపతి క్రైమ్ : నగరంలోని కేఎల్‌ఎం యాక్సివా ఫిన్‌వెస్ట్‌మెంట్‌లో భారీ మోసం జరిగినట్లుగా కంపెనీ రీజనల్ మేనేజర్ శుక్రవారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు... కేఎల్‌ఎం యాక్సివా కొర్లగుంట బ్రాంచ్‌లో ఈనెల 12వ తేదీన ఆడిటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీదేవి అనే కస్టమర్ గోల్డ్ లోన్లకు సంబంధించి అవకతవకలు జరిగినట్లుగా గుర్తించారు. ఆమె 100 గ్రాములు బంగారం తాకట్టు పెట్టగా, అది మాయం చేసి అందులో 60 గ్రాముల నకిలీ బంగారం ఉంచినట్లుగా అప్రైజర్లు ఈశ్వర్, జేవీ కిరణ్ కనిపెట్టారు. వెంటనే కంపెనీ రీజనల్ మేనేజర్ చల్లా హేమగిరికి తెలిపారు. ఈ మేరకు కంపెనీ ఉద్యోగులు అరుణ్ కుమార్, శివకుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షేర్ మార్కెట్ పేరిట మోసం

తిరుపతి క్రైమ్ : షేర్ మార్కెట్ పేరుతో ఇద్దరు మోసం చేసినట్లు బాధితురాలు జమున శుక్రవారం ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు.. నగరంలోని ఎస్‌బీ కాలనీకి చెందిన జమున ఓ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేస్తుండగా మూడేళ్ల క్రితం విమల అనే మహిళ పరిచయమైంది. విమల ఈమేరకు సుధాకర్ అనే వ్యక్తిని పరిచయం చేసింది. ఇద్దరూ కలిసి షేర్ మార్కెట్ ట్రేడింగ్‌లో డబ్బులు పెడితే రెట్టింపు చేస్తామని జమునను నమ్మించారు. దీంతో ఆమె రూ.15లక్షలు అందజేసింది. అయితే డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్ల ఆక్రమణపై ఫిర్యాదు


ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న మహిళలు

తిరుపతి తుడా : నగరంలోని 44, 43 డివిజన్ పరిధిలో రోడ్లు ఆక్రమణకు గురయ్యాయని, దీంతో తీవ్రంగా ఇబ్బందిపడుతున్నామని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. నర్సరీ వీధిని ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ రోడ్డు ఆక్రమణ కారణంగా అంబులెన్స్ వచ్చే పరిస్థితి లేక ఇటీవల ఇద్దరు మృత్యువాత పడినట్లు వెల్లడించారు. డ్రైనేజీ సమస్య కారణంగా దోమలు విపరీతంగా వ్యాప్తి చెందాయని తెలిపారు. అయితే రోడ్డును విస్తరిస్తే చాలా ఇళ్లు దెబ్బతింటాయని పలువురు స్థానికులు సైతం ఎమ్మెల్యేకు విన్నవించారు. ఆయన మాట్లాడుతూ నర్సరీ వీధిలో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి రూ.76 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

నిర్మలకు డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ కంప్యూటర్ సైన్స్ విభాగం పరిశోధక విద్యార్థిని కొటారి నిర్మలకు వర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ ఎస్.ఉషారాణి పర్యవేక్షణలో 'సమ్ స్టడీస్ అన్ అథంటికేషన్ అండ్ ప్రైవసీ ఇష్యూస్ ఫర్ మెడికల్ డేటా ఇన్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్' అనే అంశంపై ఆమె పరిశోధన పత్రాలు సమర్పించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది.

కదిలింది.. రథం


జగన్నాథ రథయాత్రను ప్రారంభిస్తున్న అతిథులు

జాతీయ సంస్కృత యూనివర్సిటీ ఆవరణలోని జగన్నాథస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్సిటీ ఒడిశా చైర్ ఆధ్వర్యంలో జగన్నాథుని రథయాత్రను ప్రారంభించారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయం, గాంధీరోడ్, టౌన్‌క్లబ్, బాలాజీ కాలనీ మీదుగా సంస్కృత వర్సిటీ వరకు యాత్ర కొనసాగింది. జగన్నాథుని నామ స్మరణతో తిరునగరం మార్మోగింది. తిరుపతి ఇస్కాన్ మందిరం వైస్ ప్రెసిడెంట్ రూపేశ్వర్ చైతన్య ప్రభు, వర్సిటీ రిజిస్ట్రార్ కడియం వెంకటనారాయణరావు, ప్రొఫెసర్లు రజనీకాంత్ శుక్లా, ఎస్.దక్షిణామూర్తి శర్మ, రాధాగోవింద త్రిపాఠి, వెంకటరావు, వీసీ సతీమణి సీతామహాలక్ష్మి, ఒడిశా చైర్ డైరెక్టర్ డాక్టర్ జ్ఞానరంజన పండా, అడ్వైజర్ శంకరనారాయణ, డాక్టర్ కుమార్, పీడీ సేతురామ్ పాల్గొన్నారు. – తిరుపతి సిటీ


యాత్రలో భక్తులు

ఆక్రోశం ఆగ్రహమై!

సమస్యలపై స్పందన లేక సహనం నశించింది.. ఆవేదనతో గుండె మండింది.. ఆక్రోశం ఆగ్రహంగా మారింది.. కార్మిక లోకం కదం తొక్కింది.. రిలే నిరాహారదీక్షతో నిరసన తెలిపింది.. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని అల్టిమేటం జారీ చేసింది.. ఈ మేరకు స్విమ్స్ ఆస్పత్రి అధికారులకు నోటీసు అందించింది.. ఇప్పటికైనా వివక్షను విడనాడాలని స్పష్టం చేసింది.. బెదిరింపు ధోరణి మానుకోవాలని కోరింది.. మొండిగా వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించింది. వేతన వెతలను వెంటనే తీర్చాలని తెగేసి చెప్పింది. ఈ మేరకు శుక్రవారం రెండో రోజు దీక్షను కొనసాగించింది.


స్విమ్స్ ఆస్పత్రి ఆవరణలో దీక్ష చేస్తున్న కార్మికులు

- ఆందోళనకు దిగిన స్విమ్స్ కార్మికులు
- రెండో రోజుకు చేరిన రిలే దీక్ష
- సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట
- ఆస్పత్రి అధికారులకు కార్మికుల హెచ్చరిక

తిరుపతి తుడా : స్విమ్స్‌లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని పలు మార్లు టీటీడీ, ఆస్పత్రి అధికారులకు విన్నవించారు. అయితే అధికారులు దాటవేత ధోరణితో వ్యవహరించారు. దీంతో సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు స్విమ్స్ యాజమాన్యానికి సమ్మె నోటీసు అందించారు. అప్పటికీ స్పందన లేకపోవడంతో గురువారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రెండో రోజు శుక్రవారం స్విమ్స్ ఆవరణలో కొనసాగిన రిలే నిరాహార దీక్షలో మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ రాఘవ శర్మ, సీఐటీయూ నేతలు ఆర్.లక్ష్మమ్మ, పి.బుజ్జి మద్దతు తెలిపారు.

నేడు చర్చలు

కార్మికులతో శనివారం డీసీఎల్ కార్యాలయంలో స్విమ్స్ అధికారులు చర్చలు జరపనున్నారు. చర్చలు విఫలమైతే పూర్తి స్థాయిలో మొత్తం 820 మంది విధులను బహిష్కరించి సోమవారం నుంచి సమ్మెకు దిగుతామని కార్మికులు హెచ్చరిస్తున్నారు.

డిమాండ్లు ఇవీ..

- మూడో తరగతి ఉద్యోగుల స్థాయిలో వార్డు బాయ్‌లకు వేతనాలు పెంచాలి
- అరియర్స్‌తో పాటు వేతనాలను తక్షణం చెల్లించాలి
- కార్మికులందరినీ లక్ష్మీ శ్రీనివాస కార్పొరేషన్ ఉద్యోగులుగా పరిగణించాలి
- కార్మికులను వార్డ్‌బాయ్‌లుగా గుర్తించాలి. ఈ మేరకే ఐడెంటిటీ కార్డులు అందించాలి.
- గుర్తింపు కార్డుల్లో ఫోర్జరీకి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- అక్రమంగా తొలగించిన కార్మికులను విధులలోకి తీసుకోవాలి
- లైంగిక వేధింపుల నిరోధక కమిటీ ఏర్పాటు చేయాలి
- ప్రతి కార్మికుడికీ యూనిఫామ్ ఇవ్వాలి.
- మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గది ఏర్పాటు చేయాలి.
- కార్మికులకు విశ్రాంతి గదిని కేటాయించాలి
- యూనియన్ కార్యాలయం కోసం రూమ్ ఇవ్వాలి.

మొండివైఖరి విడనాడాలి



స్విమ్స్ కార్మికులతో అధికారులు వ్యవహరిస్తున్న తీరు దారుణం. వేతనాలు పెంచకుండా, అరియర్స్ ఊసే ఎత్తకుండా మానసికంగా హింసిస్తున్నారు. కార్మికులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. సమస్యలను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరించడం సమంజసం కాదు.

\- జి.రవి, యూనియన్ జనరల్ సెక్రటరీ,

తక్షణం పరిష్కరించాలి



కార్మికుల సమస్యలపై ఏడాది కిందట డైరెక్టర్ సమక్షంలో రాతపూర్వకంగా ఒప్పందం చేసుకున్నాం. ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం దారుణం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను తక్షణమే పరిష్కరించాలి.లేకుంటే ఉద్యమం తప్పదు.

\- వి.సూరి, యూనియన్, అధ్యక్షుడు

డిమాండ్లు పరిష్కరించాలి



ఎన్నో ఏళ్లుగా సేవే పరమావధిగా కష్ట పడుతున్నాం. వేతనాలు పెంచకపోగా బెదిరింపులకు దిగుతున్నారు. మా న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి. మమ్మల్ని చిన్నచూపు చూడకుండా తగిన గుర్తింపు ఇవ్వాలి. మూడో తరగతి ఉద్యోగులతో సమానంగా వేతనాలు పెంచాలి. దాటవేత ధోరణి తగదు.

\- టి.నవీన, సరస్వతి, కార్మికులు

స్పందనే లేదు



కార్మికులను వార్డు బాయ్‌లుగా గుర్తించాలి. పది ప్రధాన డిమాండ్లతో కొన్నేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదు. రోగులు ఇబ్బంది పడతారని ఇంతకాలం నిరీక్షించాం. అయినా అధికారులలో స్పందనే లేదు. ఇప్పుడు చర్చలు విఫలమైతే సమ్మె శరణ్యం

\- ఎం.గోపి, బాషా, యూనియన్ వైస్ ప్రెసిడెంట్, ఆర్గనైజింగ్ సెక్రటరీ

వివక్ష చూపుతున్నారు



రోగులకు సేవ చేస్తున్న కార్మికుల సమస్యలపై అధికారులు స్పందించకపోవడం బాధాకరం. మహిళలకు విశ్రాంత గదులు లేవు. లైంగిక వేధింపులకు పాల్పడినా అడిగే దిక్కులేదు. వేతనాలు చెల్లింపులోనూ వివక్ష చూపుతున్నారు. రెండేళ్లుగా సమస్యలపై పోరాడుతున్నా అధికారులు పట్టించుకోలేదు.

\- జయమ్మ, కుమారి, యూనియన్ కమిటీ సభ్యులు

నోటీస్ బోర్డు

- శ్రీగోవిందరాజస్వామి తిరుమాడ వీధుల్లో ఉదయం 4.45 గంటలకు నగర సంకీర్తన.
- డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ మత్తు వదలరా నినాదంతో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పూర్ణకుంభం సర్కిల్ నుంచి 3కే రన్.
- స్విమ్స్ వద్ద ఉదయం 10 గంటలకు స్విమ్స్ కార్మికుల రిలే నిరాహారదీక్ష రెండో రోజు.
- తిరుపతి రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు డివిజనల్ స్థాయి మహిళా సర్పంచ్‌లకు పరిపాలన, సంక్షేమంపై శిక్షణ తరగతులు.
- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మోహన్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు రుయా ఆస్పత్రి వద్ద నిరసన. అనంతరం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ వద్ద ఆందోళన.
- చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో ఉదయం 10.45 గంటలకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 104వ జయంతి సభ.
- శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఉదయం 6 గంటలకు స్వామివారికి అభిషేకం, సాయంత్రం 5 గంటలకు స్వామివారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు – యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు భారత దేశ సాంఖ్యక శాస్త్ర పితామహుడు మహల నోబిస్ జయంతి సభ.
- తారకరామ నగర్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో ఉదయం 10 గంటలకు గణిత అష్టావధానం.
- పద్మావతీపురంలోని ఐటీఐ కళాశాలలో ఉదయం 8 గంటల నుంచి మెగా జాబ్ మేళా.
- ఆర్‌సీ పురం మండలం, కొత్తకండ్రిగలోని ప్రాణ యోగ ఆశ్రమంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పురోహిత సంక్షేమంపై ధర్మప్రచార సభ.
- శ్రీనివాసం, విష్ణు నివాసం, అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్‌లో తిరుమలకు నడక మార్గంలో వెళ్లే భక్తులకు సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు శ్రీవారి ఉచిత దర్శన టోకెన్ల పంపిణీ.

కళార్చన పేరుతో మోసం

తిరుమల : తిరుమలలోని శ్రీ శ్రీనివాస కళార్చన పేరుతో కొందరు మోసానికి పాల్పడిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్, వరంగల్, నిర్మల్ ప్రాంతాల నుంచి 2,000 మంది భక్తులు తిరుమలకు నృత్యాలు చేసేందుకు వచ్చారు. కళాకారుల నుంచి డబ్బులు వసూలు చేయడంతో ఈ కార్యక్రమాన్ని టీటీడీ నిలిపివేసింది. శ్రీనివాస కళార్చన కార్యక్రమం కోసం అభిషేక్ అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు 1,200 మంది నృత్య ప్రదర్శనకు టీటీడీ అనుమతించింది. మిగిలిన 800 మంది నృత్య ప్రదర్శన ఆగిపోవడంతో ఆస్థాన మండపం వద్ద శుక్రవారం కళాకారులు బారులు తీరారు. తమ పిల్లలను నృత్య ప్రదర్శనకు అనుమతించాలని టీటీడీని కోరుతూ తల్లిదండ్రులు విన్నవించారు. కళాకారుల అభ్యర్థనతో ఆ 800 మంది ప్రదర్శనకు కూడా టీటీడీ అనుమతించింది.

ఎంఈఓ చిత్తశుద్ధికి అభినందన



పాఠశాలలో దత్త పుత్రుడిని చేర్పిస్తున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల : ప్రభుత్వ పాఠశాలపై చిత్తశుద్ధిని కనబరచిన ఎంఈఓ బాబ్జీ అభినందనీయులని ప్రధానోపాధ్యాయిని రోహిణికుమారి కొనియాడారు. శుక్ర వారం స్థానిక ఎస్‌వీఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓ బాబ్జీ తన దత్త పుత్రుడు మోహన్‌ను చేర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఎంఈఓని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సర్కారు బడు ల్లో పనిచేసేవారందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు మురళి, శ్రీధర్ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

సమ్మెతో 'కూటమి'కి గుణపాఠం


మాట్లాడుతున్న రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్ : ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్రం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలకు దేశవ్యాప్త సమ్మెతో గుణపాఠం చెప్పాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో భారత్ బంద్‌పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, ఐఎఫ్‌టీయూ నేత వెంకటరత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య పాల్గొని ప్రసంగించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికులను కట్టు బానిసలు చేసేందుకు ప్రభుత్వాలు తెగబడుతున్నాయని విమర్శించారు. సమ్మెను జయప్రదం చేసేదుకు అన్ని సంఘాలు, పార్టీలు కలిసిరావాలని కోరారు. సమావేశంలో నేతలు ఎన్‌డీ రవి, లోకేష్, తులసి రాజన్, ప్రభాకర్ బాబు, పురుషోత్తం, శివ, శ్రీరాములు, నరసింహులు, మహేంద్ర, కేవై రాజా, బాబు పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం సరికాదు


మాట్లాడుతున్న సీపీఎం నేత మూలం రమేష్

తిరుపతి కల్చరల్ : ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేయాలనే నిర్ణయం సరికాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మూలం రమేష్ మండిపడ్డారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద బిడ్డలకు విద్యను దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం విలీన ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ నాటి ప్రభుత్వం తెచ్చిన జీవో 117ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని విస్మరించడం దారుణమన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా తిరుపతి జిల్లాలోనే 583 ప్రాథమిక పాఠశాలలు విలీనం చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ జిల్లాలోని మామిడి రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని తెలిపారు. వేణుగోపాల్ కాలనీలో 70 ఇళ్లను అర్ధరాత్రి కూల్చివేసి నెల గడిచిన కనీసం ఒక్కరిని కూడా అరెస్ట్ చేయకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఎం నేతలు కందారపు మురళి, సాయిలక్ష్మి, అంగురి పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, జయచంద్ర, మాధవ్, వేణుగోపాల్, ప్రాంతీయ కార్యదర్శులు రమేష్,మణి, చెంగయ్య, ముకుందా, నాగరాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణే లక్ష్యం


వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి క్రైమ్ : నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులకు 27 బైక్‌లను అందించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు రవి మనోహర్ ఆచారి, నాగభూషణం పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ

తిరుపతి రూరల్ : మండలంలోని పేరూరు పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో తాగునీటి సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది. కాలనీ వాసులకు నాణ్యమైన మినరల్స్‌తో కూడిన సురక్షిత మంచి నీటిని అందించేందుకు పంచాయతీ 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి రూ.5 లక్షలు కేటాయించింది. శుక్రవారం ఈ మేరకు మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ మూలం చంద్ర మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యత కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ప్లాంటు ద్వారా వందలాది కుటుంబాలకు సురక్షిత మంచి నీరు అందించే అవకాశ ముంటుందని వెల్లడించారు. వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి మాట్లాడుతూ ఎంపీపీ, సర్పంచ్ కృషిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. ప్రజల అవసరాలను గుర్తించి స్థానిక టీడీపీ నేతలు కలసి రావడం శుభసూచకమని చెప్పారు. అనంతరం స్థానిక టీడీపీ నేతలు నాగూరు శ్రీనివాసులు, కాయం వెంకటేష్, దామినేటి నాగరాజు, మహేష్, ముకుందరెడ్డి, గంగాధర్‌లతో కలసి భూమి పూజ నిర్వహించారు. ఎంపీడీఓ రామచంద్ర, పంచాయతీ కార్యదర్శి జ్యోతిశ్వర్ ప్రసాద్ ల్గొన్నారు.

బాబు మోసం.. వినూత్న ప్రచారం


క్యూఆర్ కోడ్ ఫ్లెక్సీని చూపుతున్న మునీశ్వరరెడ్డి

తిరుపతి రూరల్ : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం తిరుపతి రూరల్ మండలంలోని అన్ని పంచాయతీల్లో చంద్రబాబు మోసపు మేనిఫెస్టోపై వినూత్న ప్రచారం చేపట్టనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం పద్మావతిపురంలోని భూమన నివాసంలో తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ మేరకు బాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ రూపొందించిన క్యూఆర్ కోడ్ ఫ్లెక్సీని ప్రదర్శించారు.

బొజ్జా తారకం సేవలు మరువలేం


బొజ్జా తారకం చిత్రపటాని నివాళులర్పిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : దళిత, ఆదివాసీ, ఇతర పేద వర్గాల పక్షాన రాజీలేని పోరాటం సాగించిన బొజ్జా తారకం సేవలు మరువలేమని దళిత ,ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కొనియాడారు. శుక్రవారం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యాలయంలో దళిత ఉద్యమ నేత, న్యాయవాది బొజ్జా తాకరం 86వ జయంతి నిర్వహించారు. ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య, టీటీడీ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగ సంఘాల నేత ఎం.ప్రసాద్ రావు, సీపీఎం జిల్లా నేత వెంకటరమణ, రచయిత గొడుగు చింత గోవిందయ్య హాజరై ముందుగా బొజ్జాతారకం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వారు మాట్లాడుతూ కారంచేడు, చుండూరు, లక్షింపేట ఘటనల్లో బాధితులకు అండగా నిలబడిన మానవతావాది బొజ్జాతారకం అని తెలిపారు. కార్యక్రమంలో నేతలు కిషోర్, రాజేష్, హర్ష, మన్మథ, సుబ్రమణ్యం, గోపాల్, మొగిలప్ప, బాబు, హరిబాబు, శంకర్, దేవరాజులు పాల్గొన్నారు.





తవ్వేసి.. వదిలేసి

తిరుపతి నగరంలో అభివృద్ధి పేరిట అడ్డదిడ్డంగా తవ్వేస్తున్నారు. తర్వాత అలాగే వదిలేసి ప్రజలను ముప్పతిప్పలు పెడుతున్నారు. అందులో భాగంగానే రెండు నెలల క్రితం సుందరయ్య నగర్, రైల్వే కాలనీ మెయిన్ రోడ్డులో వాటర్ లైన్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం తవ్వేశారు. అనంతరం పనులను పూర్తి చేయకుండా అలాగే వదిలేశారు. దీంవతో ఆ మార్గంలో నిత్యం రాకపోకలు సాగించేవారు నానా ఇక్కట్లు పడుతున్నారు. ఎదురుగా కారు..వ్యాన్ వస్తే ఇక అంతే సంగతులు. ఒక్కోసారి పలు వాహనాలు అదుపు తప్పి గుంతల్లోకి వెళ్లిపోతున్నాయి. ఈ క్రమంలో వాటిని బయటకు తీసేందుకు పడే అగచాట్లు అన్నీ ఇన్నీకావు. అయినా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోకపోవడంపై నగరవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు. - సాక్షి, ఫొటోగ్రాఫర్, తిరుపతి